# కరెంట్ కంచెలు.. కాటేస్తున్నాయి!

- ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న అన్నదాతలు
- తరుచూ ప్రమాదాలు
- రైతు కుటుంబాల్లో చీకట్లు

**జహీరాబాద్ టౌన్:** అడవి పందుల నుంచి పంటలను కాపాడుకునేందుకు రక్షణగా పొలం చుట్టూ కంచెలుగా కరెంట్ తీగలు కట్టుకుని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. పంట రక్షణగా ఉన్న ఫెన్సింగ్ తీగలు రైతులను కాటేస్తున్నాయి. ఇప్పటి వరకు పలు సంఘటనలు చోటు చేసుకుని జహీరాబాద్ ప్రాంతంలోని అన్నదాతలు ప్రాణాలు కోల్పోయారు.



జొన్న పంట చుట్టూ వేసిన ఫెన్సింగ్

### అడవి పందుల బెడద ఎక్కువ

నియోజకవర్గంలో ఎక్కువ మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రధానంగా చెరకు, మొక్కజొన్న, అల్లం, జొన్న, ఆలుగడ్డ, కూరగాయలు, పూల తోటలు సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో అడవి పందులు, జింకల బెడద అధికంగా ఉంది. వన్యప్రాణులు తరుచూ పంట పొలాలపై దాడులు చేస్తున్నాయి. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి పండించిన పంటను అడవి పందులు, ఇతర వన్యప్రాణులు నష్టం కల్గిస్తున్నాయి. రాత్రి పూట గుంపులు గుంపులుగా పంట పొలాలపై దాడులు చేయడం వల్ల అన్నదాతలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. పంటల రక్షణ కోసం చుట్టూ చీరలు కట్టడం తదితర ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా చేతికి వచ్చిన పంటలను ధ్వంసం చేస్తున్నాయి.



కరెంట్ షాక్ తగిలి ప్రాణాలు కోల్పోయిన గోవింద్‌పూర్ రైతు (ఫైల్)

### తీగలే కంచెగా..

రైతులు పంటల రక్షణకు కరెంట్ కంచెలు ఏర్పాటు చేసుకుంటున్నారు. వన్యప్రాణ సంరక్షణ చట్టం ప్రకారం విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయడం నేరం. రైతులు గుట్టుచప్పుడు కాకుండా పంట పొలాల చుట్టూ ఫెన్సింగ్ వేసుకుంటున్నారు. కరెంట్ తీగలకు కనెక్షన్ ఇచ్చుకుంటున్నారు. ఈ కంచెల కారణంగా వన్యప్రాణులతో పాటు రైతుల ప్రాణాలు కోల్పోతున్నారు. పంట చుట్టూ కంచె వేసిన విషయం మరిచిపోయి పొలాలకు వెళ్లిన రైతులు గమనించకుండా తీగలకు తాకి ప్రాణాలు విడుస్తున్నారు. కొంత మంది పశువుల కాపరులు కూడా గమనించకుండా ప్రమాదాల బారిన పడుతున్నారు.

### కొన్ని సంఘటనలు

- జహీరాబాద్ మండలంలోని గోవింద్‌పూర్‌లో ఈ నెల 6న అన్నదమ్ములు వన్యప్రాణుల నుంచి పంట కాపాడుకోనేందుకు చెరకు తోట చుట్టూ కరెంట్ తీగలు కట్టారు. ఫెన్సింగ్ తీగలకు కరెంట్ కనెక్షన్ ఇవ్వబోయి షాక్ తగిలి ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.
- ఇటీవల జహీరాబాద్‌లోని శేఖాపూర్ తండాలో కరెంట్ షాక్‌తో యువ రైతుల చనిపోయాడు. పంట పొలం వద్ద ఫెన్సింగ్ తీగలకు కరెంట్ కనెక్షన్ ఇస్తూ షాక్ తగిలి మృతి చెందాడు.
- ఝరాసంగం మండలంలోని బిడేకన్నె గ్రామంలో అడవి పందుల నుంచి చెరకు తోటను కాపాడుకునేందుకు దేవదాసు అనే రైతు పొలం చుట్టూ కంచె వేసుకున్నాడు. భార్యాభర్తలు గడ్డి మందు స్ప్రే చేస్తూ ప్రమాదవశాత్తు భార్యకు షాక్ తగిలింది. ఆమెను రక్షించబోయి భర్త దేవదాసు ఇద్దరు ప్రాణాలు విడిచారు.
- కోహీర్ మండలంలోని సజ్జాపూర్ గ్రామానికి చెందిన రైతు పాండురంగారెడ్డి రక్షణ కోసం వేసిన ఫెన్సింగ్ తీగ తగలి అక్కడిక్కడే మృతి చెందాడు. ఇలా తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుని అన్నదాతలు ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో వారి కుటుంబాల్లో చీకటి అలుముకుంటోంది.

ఆర్థిక స్తోమత ఉన్న కొంత మంది రైతులు సోలార్ కంచె ఏర్పాటు చేసుకుంటున్నారు.

**అవగాహన కల్పించాలి**

విద్యుత్ కంచెల వల్ల కలిగే అనర్థాల గురించి ట్రాన్స్‌కో అధికారులు రైతులకు అవగహన కల్పించాలి. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. కరెంట్ తీగలకు బదులు ప్రత్నామ్యాయం గురించి వివరించాలి. కరెంట్ షాక్ వల్ల చనిపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి.

– వీరన్న, రైతు, హద్నూర్

**తీగలు కట్టుకుంటే కేసులు నమోదు చేస్తాం**

పొలాల చుట్టూ కరెంట్ తీగలు కట్టుకొని విద్యుత్ కనెక్షన్ ఇస్తే క్రిమినల్ కేసులు పెడుతాం. పొలాల చుట్టూ ఫెన్సింగ్ వేయడం తప్పు. పైగా కరెంట్ కనెక్షన్ ఇవ్వడం పెద్ద నేరమన్నారు. కరెంట్ తీగలకు బదులు సోలార్ కంచెలు ఏర్పాటు చేసుకుంటే ఎలాంటి ప్రమాదం ఉండదు.

– మధు, ట్రాన్స్‌కో ఏడీ

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**మునిపల్లి(అందోల్):** మండలంలోని చీలపల్లిలో ఆదివారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. మాజీ ఎంపీపీ రాంరెడ్డి, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్, చీలపల్లి కాంగ్రెస్ నాయకులు వీరన్న ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

**అందోల్‌లోని అల్మాయిపేటలో..**

**వట్‌పల్లి(అందోల్):** అందోల్‌లోని అల్మాయిపేటలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ నేత అనిల్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. మంత్రి దామోదర సహకారంతో పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, నర్సింలు, యేసయ్య పాల్గొన్నారు.



మునిపల్లి: పనులు ప్రారంభిస్తున్న నాయకులు

**గడ్డపోతారం మున్సిపాలిటీలో..**

**జిన్నారం (పటాన్‌చెరు):** గడ్డపోతారం మున్సిపాలిటీలోని మాదారం నుంచి మెడికల్ డివైస్ పార్క్ వరకు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ సహకారంతో రోడ్డు పనులు ప్రారంభించారు. త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు.

## ఉపాధి హామీ నిధులు ఖర్చు చేయాలి

**మునిపల్లి(అందోల్):** జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు ఖర్చు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా నాయకులు రమేశ్‌గౌడ్ సంబంధిత అధికారులను ఆదివారం కోరారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, మురికి కాల్వల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం రూ.60 కోట్ల మంజూరు చేసింది. ఇప్పటివరకు 50 శాతం నిధులు మాత్రమే ఖర్చు చేశారు. ఇంకా రూ.39 కోట్ల మార్చి 31లోగా ఖర్చు చేయకుంటే తిరిగి వెనక్కి వెళ్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి ఉపాధిహామీ నిధులను పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలని కోరారు.

### ఆలయంలో చోరీ



**జిన్నారం (పటాన్‌చెరు):** జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీలోని హనుమాన్ ఆలయంలో చోరీ జరిగింది. శనివారం అర్ధరాత్రి ఆలయంలోకి దుండగలు ప్రవేశించి హుండీని ధ్వంసం చేశారు. హుండీలోని డబ్బులను దోచుకెళ్లారు. విషయంపై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### దుకాణాల వేలం పాట

**సదాశివపేట(సంగారెడ్డి):** పట్టణంలోని లోపలికోట హనుమాన్ ఆలయానికి చెందిన నాలుగు దుకాణాలను లీజు వేలం పాట 24న సోమవారం ఉ.12.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎండోమెంట్ అధికారి శివరుద్రప్ప తెలిపారు. ఆసక్తిగల వారు రూ.50 వేల డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

## మాదిగలకు న్యాయం చేయడం బాధ్యత

**జహీరాబాద్:** ఎస్సీ వర్గీకరణ చట్టం సీఎం రేవంత్‌రెడ్డి త్వరగా అమలు చేసే నైతిక బాధ్యత తీసుకోవాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మార్పీఎస్ నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. మాదిగల వల్ల రేవంత్‌రెడ్డికి లాభం జరిగిందని, మాదిగలకు మాత్రం ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ఇప్పటికే ఎస్సీ వర్గీకరణ లేకుండానే 11వేల టీచర్ పోస్టులను భర్తీ చేసి మాదిగలకు అన్యాయం చేశారని ఆరోపించారు. దీక్షలో ఆయా సంఘాల నాయకులు అలిగి శ్రీనివాస్, జె.సుందర్ రాజ్, డి.అనిల్‌కుమార్, కంతి పవన్‌కుమార్, ఉల్లాస్ మాదిగ, జైరాజ్, రాంచందర్, టింకు, సుకుమార్, నగేష్, వసంత్, సుధాకర్, అబ్రహాం, ప్రకాష్, మహేందర్, సతీష్, పవన్, ప్రశాంత్, మహేందర్, పవన్, రూబెన్, ఏలియా పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సదాశివపేట(సంగారెడ్డి): సమ్మేళంలో పూర్వ విద్యార్థులు

**సదాశివపేట(సంగారెడ్డి):** మండలంలోని నిజాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1997–98 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులు మాణయ్య, సోమలింగం, మహహుజిద్దిన్‌లను శాలువాతో సన్మానించి పాదాభివందనం చేశారు.

**సరస్వతీ శిశుమందిరంలో..**

**జహీరాబాద్ టౌన్:** పట్టణంలోని సరస్వతీ శిశుమందిరంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2011–12 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు 12 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. అనంతరం ఒకరికొక్కరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషం వ్యక్తం చేశారు. గురువులకు నమస్కరిస్తూ వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురువులు, శిశు మందిర్ ఆచార్యులు కిషన్‌రావ్, శ్రీశైలం , గోవర్ధన్, శివరామ్, రాములు, నర్సింహ్మారెడ్డి, మల్లయ్య, స్వరూప, పద్మ తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్ టౌన్‌లో..



కల్హేర్: పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

**సిర్గాపూర్ ఉన్నత పాఠశాలలో..**

**కల్హేర్(నారాయణఖేడ్):** సిర్గాపూర్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో 2005–06 సంవత్సరంలో ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత కలుసుకుని పాత జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామికి పూజలు

**సంగారెడ్డి టౌన్:** బైపాస్‌లోని ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవాలయ కమిటీ చైర్మన్ శ్రీశైలం గురుస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి అష్టోత్తర శత కలశార్చన కార్యక్రమం జరిపించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అరుణ్ గురుస్వామి పడిని వెలిగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



దేవాలయంలో అష్టోత్తర శత కలశార్చన

## బ్యాంక్ సేవలు వినియోగించుకోండి

**యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ వికాస్**

**జహీరాబాద్ టౌన్:** గ్రామీణ ప్రజలు, రైతులు బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ వికాస్ అన్నారు. మండల కేంద్రం మొగుడంపల్లిలోని యూనియన్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన విత్‌డ్రా ఏటీఎం మిషన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు, ప్రజలకు బ్యాంక్ అన్ని రకాల సేవలను అందిస్తుందని, ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోవద్దన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే బ్యాంకులకు మనుగడ ఉంటుందన్నారు. పంట రుణాల మంజూరు, వడ్డీ చెల్లింపు తదితర సేవల విషయంలో బ్రోకర్లను ఆశ్రయించొద్దన్నారు. కార్యక్రమంలో మేనేజర్ ముఖేష్, చీఫ్ మేనేజర్ సంజయ్ చౌదరి, డిప్యూటీ బ్రాంచ్ మేనేజర్ జె.ప్రవాస్ కుమార్, సిబ్బంది దత్తాత్రేయ, జె.రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ వికాస్

## ఘనంగా చైతన్య మహాప్రభు జయంతి

**జహీరాబాద్ టౌన్:** శ్రీ కృష్ణుడే కలియుగంలో శ్రీ చైతన్య మహా ప్రభువుగా అవతరించారని కంది ఇస్కాన్ టెంపుల్, అక్షయ పాత్ర నిర్వాహకులు విభీషణ్ ప్రభు పేర్కొన్నారు. చైతన్య మహాప్రభు జయంతిని పురస్కరించుకొని స్థానిక హమాలీ కాలనీలోని పెద్దమ్మ ఆలయంలో నగర సంకీర్తన అనంతరం ఏర్పాటు చేసిన సత్సంగ సభలో ఆయన ప్రసంగించారు. కలియుగంలో చైతన్య ప్రభును కృష్ణుడి అవతారమని చెబుతారన్నారు. హరే కృష్ణ మంత్ర జపాన్ని జన బాహుళ్యంలోకి తెచ్చి విస్తృత ప్రాచుర్యాన్ని కల్పించారన్నారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అంతకుముందు ప్రధాన వీధులు కలియ తిరుగుతూ కృష్ణ కీర్తనలు ఆలపించారు. సంగీత వాయిద్యాలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ భక్తులు ఆనంద పరవశ్యంలో మునిగితేలారు. నగర సంకీర్తనలో చిన్నారులు, మహిళలు, హరేకృష్ణ మూమెంట్ బృందం సభ్యులు పాల్గొన్నారు.



కృష్ణకీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

## అవసాన దశలో అంబులెన్స్

**నారాయణఖేడ్:** అత్యవసర సమయాల్లో బాధితుల ప్రాణాలు కాపాడే 108 అంబులెన్స్ అవసాన దశకు చేరుకుంది. వాహనం పాతపడి సరియైన వసతులు లేక ఇబ్బందులు పడుతూ రోగులను చేరవేయాల్సి వస్తుంది. డివిజన్ కేంద్రం నారాయణఖేడ్‌కు కేటాయించిన అంబులెన్స్ 3.70లక్షల కిలోమీటర్లపైగా నడిచింది. వాహనం డోర్లు దెబ్బతిన్నడంతో లోపలికి దుమ్ము, ధూళి వస్తుంది. వాహనం లోపల ఫ్యాన్ కూడా పనిచేయడం లేదని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత వాహనం కావడంతో సంగారెడ్డి ఆస్పత్రికి రోగులను తీసుకెళ్లేందుకు ఆలస్యం అవుతుందని ఆరోపిస్తున్నారు. చిన్నచిన్న మండల కేంద్రాలకు నూతన వాహనాలు ఇచ్చిన అధికారులు ఖేడ్‌పై శీతకన్ను ప్రదర్శిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఖేడ్ నుంచి సంగారెడ్డికి ప్రతీనెల 60 వరకు కేసులను తీసుకెళ్తున్నారు. రోగులను తరలించే వాహనం కండీషన్‌గా ఉండాల్సి ఉన్నా ఫిట్‌నెస్ కోల్పోయి రోగులు వారి వెంట వస్తున్నా బంధువులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఖేడ్‌కు అధునాతన అంబులెన్స్ వాహనాన్ని కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.



పాతబడ్డ అంబులెన్స్ వాహనం

## అసభ్య పోస్టులపై చర్యలు తప్పవు

**పటాన్‌చెరు టౌన్:** సీఎం రేవంత్‌రెడ్డిపై సోషల్‌మీడియాలో అసభ్య పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తప్పవని కాంగ్రెస్ శ్రేణులు హెచ్చరించారు. ఆదివారం పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సీఐ వినాయక్‌రెడ్డికి ఫిర్యాదు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్‌కు అనుకూలంగా పోస్టులు పెట్టడం చూస్తే.. దీని వెనుక బీఆర్ఎస్ పార్టీ ఉందని అనుమానం వ్యక్తం అవుతుందన్నారు. సీఎంతో పాటు వారి కుటుంబ సభ్యులపైన తీవ్ర పదజాలంతో దూషిస్తూ రోజువారీగా సామాజిక మాధ్యమాల ద్వారా పోస్టులు పెడుతూ తీవ్ర ఆందోళనకు గురిచేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, మాజీ పీసీసీ కార్యదర్శి మతిన్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అతిక్, నాయకులు సుధాకర్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.



సీఐకి ఫిర్యాదు పత్రం అందజేస్తున్న నేతలు

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసన జిల్లా వ్యాప్తంగా ఆదివారం కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశారు. కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సభ మీ సొంతం కాదంటూ స్పీకర్‌ను ఉద్దేశించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. వెంటనే స్పీకర్‌కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులకు స్పీకర్‌పై గౌరవం లేదని మండిపడ్డారు.



పటాన్‌చెరు టౌన్: జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కంది: కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల దిష్టిబొమ్మల దహనం



కంగ్టిలో బీఆర్ఎస్ నేతల దిష్టిబొమ్మల దహనం



కల్హేర్: ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



హత్నూర మండలం దౌల్తాబాద్‌లో..

### క్లుప్తంగా

#### క్రీడాకారులను ప్రోత్సహించాలి



బహుమతులు అందజేస్తున్న ప్రధానాచార్యులు

**సంగారెడ్డి టౌన్:** విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని శిశు మందిర్ పాఠశాల ప్రధానాచార్యులు నరసింహాగౌడ్ అన్నారు. మండలంలోని శిశుమందిర్‌లో రెండు రోజుల పాటు ఖేల్ కూద్ కార్యక్రమాలు నిర్వహించారు. మూడు జిల్లాల్లోని విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ఆదివారం బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణు, సన్రైజ్ హాస్పిటల్ డాక్టర్ స్వామిగౌడ్, అధికారులు పాల్గొన్నారు.

#### మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న పావని

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** మైనార్టీల అభివృద్ధికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని మాజీ కౌన్సిలర్ పావని అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో రంజాన్ పండగ సందర్భంగా మైనార్టీలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఏటా తన వంతు బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి వివరిస్తున్నామని తెలిపారు.

#### ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

**నారాయణఖేడ్:** ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు 126వ జయంతిని ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చౌక్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు పొట్టిశ్రీరాములు త్యాగం మరువలేనిదని కొనియాడారు.

#### ఉచిత కంటి శిబిరంతో లబ్ధి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

**నారాయణఖేడ్:** నిజాంపేట్ మండలం బాచేపల్లిలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మహోన్వి కంటి ఆస్పత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన 68 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. 11మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. మిగతా వారికి మందులు పంపిణీ చేశారు. యువనాయకులు శ్రీకాంత్, ఆస్పత్రి సిబ్బంది గీత, సాయి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

#### ప్రత్యేక పూజలు



ఔండనాగ్‌నాథ్ ఆలయంలో గోదావరి తదితరులు

**జహీరాబాద్:** జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి ఆదివారం మహారాష్ట్రలోని పర్లీ వైజ్యనాథ్‌లోని జ్యోతిర్లంగం, ఔండనాగనాథ్ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ కుటుంబ సభ్యులకు చెందిన వివాహ వేడుక మహారాష్ట్రలోని నాందేడ్ పట్టణంలో జరిగిన సందర్భంగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆమె వెంట బీజేపీ నాయకులు బి.రమేష్‌రెడ్డి, ఎస్.అరుణ్‌కుమార్, టి.వెంకట్, కె.విశ్వనాథ్, ఎస్.ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.